నమస్తే తెలంగాణ
కరీంనగర్
3 కరీంనగర్, సోమవారం 27 మే 2024 KARIMNAGAR



నాడు దవాఖాన ప్రసూతి వార్డులో బాలింతలు(ఫైల్)



ప్రస్తుతం ఖాళీగా ప్రసూతి గది

# ప్రసూతి వార్డు కళ తప్పింది!

- హుజూరాబాద్ సర్కారు దవాఖానలో సగానికి తగ్గిన ప్రసవాలు
- వైద్యుల తొలగింపుతో తగ్గిన సేవలు
- ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న గర్భిణులు

**ఐదారు నెలల క్రితం వరకు హుజూరాబాద్ సర్కార్ దవాఖానలో తల్లి అయిన మురిపెంతో బాలింతల చిరునవ్వులు.. కెవ్వుకెవ్వు మంటూ పసి పిల్లల కేరింతలతో ప్రసూతి వార్డు కలకళలాడేది. వార్డు సరిపోక మరో వార్డులో సర్దుబాటు చేసిన దృశ్యాలు కనిపించేవి. ప్రస్తుతం ఆ ప్రసూతి వార్డు కళతప్పింది. ప్రసవం కోసం వచ్చే గర్భిణుల సంఖ్య తగ్గడంతో వెలవెలబోతున్నది. గతేడాది వరకు నెలకు సరాసరి 185 వరకు ఉన్న ప్రసవాల సంఖ్య క్రమేపీ తగ్గుతూ సగానికి పడిపోయే దశకు వచ్చింది. ఈ ఏడాది మార్చిలో కేవలం 105, ఏప్రిల్‌లో 101 డెలివరీలు మాత్రమే కావడం పరిస్థితికి అద్దం పడుతున్నది.** - హుజూరాబాద్ మే 26

సర్కార్ దవాఖాన అంటే పోస్టుమార్టం చేయడానికి మాత్రమే అనే భావన నెలకొన్న పరిస్థితులు నుంచి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హుజూరాబాద్ దవాఖాన కార్పొరేట్ స్థాయిలో రూపుదిద్దుకున్నది. ప్రైవేట్ దవాఖాన దోపిడీకి అడ్డుకట్ట వేసి, నార్మల్ డెలివరీలను ప్రోత్సహించేందుకు బీఆర్‌ఎస్ సర్కారు 2017లో కేసీఆర్ కిట్ ప్రవేశ పెట్టడంతో ప్రభుత్వ దవాఖానలో డెలివరీలు గణనీయంగా పెరిగాయి. 2017లో 297 డెలివరీలు కాగా, 2018లో 333, 2019లో 839, 2020లో 2218, 2021లో 2254, 2022లో 1900, 2023లో 1952 జరిగాయి. వీరందరికీ అప్పుడు కేసీఆర్ కిట్ అందజేశారు. కేసీఆర్ కిట్ మాదిరిగానే ప్రస్తుతం వేరే కిట్ అందిస్తున్నా.. గతంలో మాదిరిగా వెంటనే ఇవ్వడం లేదు. 10 నుంచి 15 రోజుల సమయం పడుతుందని బాలింతలు చెబుతున్నారు. ఏదేమైనా ప్రభుత్వ దవాఖానలో డెలివరీలు తగ్గాయని లెక్కలను బట్టి తెలుస్తున్నది. ఈ ఏడాది జనవరిలో 110, ఫిబ్రవరిలో 99 మార్చిలో 105, ఏప్రిల్‌లో 101 కాన్పులు మాత్రమే అయ్యాయి.

### వైద్యులను తొలగింపుతో ఇబ్బందులు

సర్కారు దవాఖానాల్లో డెలివరీలు తగ్గుముఖం పడుతుండగా.. మూలిగే నక్కపై తాటిపడ్డ చందంగా ప్రభుత్వం వైద్యులను తొలగించింది. ఇందులో ఇద్దరు గైనాకాలజిస్టులు, ఇద్దరు అనస్థీషియా వైద్యులు ఉన్నారు. వీళ్లు ఎన్‌హెచ్‌ఆర్‌ఎం కింద ఔట్‌సోర్సింగ్‌లో పని చేసేవారు. ఓ వైపు ప్రసవాలు తగ్గుతున్న క్రమంలో వైద్యులను తొలగించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వైద్యుల తొలగింపు వల్ల ముమ్ముందు డెలివరీల సంఖ్య మరింత తగ్గే ప్రమాదం ఉన్నది. సేవలు సైతం గతం కంటే తగ్గడంతో గర్భిణులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానలను ఆశ్రయిస్తున్నారు.




ఈమె పేరు ఎల్కపల్లి ప్రియాంక. శంకరపట్నం మండలం రాజాపూర్. ఈమెకు మూడేళ్ల క్రితం బాబు, ఏడాది క్రితం హుజూరాబాద్ సర్కార్ దవాఖానలో మరో బాబు పుట్టాడు. రెండు సార్లు కేసీఆర్ కిట్ అందుకున్నది. డెలివరీ జరిగి వార్డుకు పంపించిన వెంటనే అధికారులు కిట్ అందించారు.



ఈమె పేరు గొరిగె ప్రత్యూష. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్బాపూర్. నాలుగు రోజుల క్రితం హుజూరాబాద్ సర్కార్ దవాఖానలో బాబుకు జన్మనిచ్చింది. ఇప్పటి వరకు వారిద్దరికీ అవసరమున్న వస్తువుల కిట్ అందలేదు. మూడేండ్ల కిందట ఇదే దవాఖానలో ఈమెకు డెలివరీ కాగా పాప పుట్టింది. అప్పుడు వెంటనే కేసీఆర్ కిట్‌ను అధికారులు అందజేశారు.

### అప్పటిలెక్క ఇప్పుడు లేదు



మూడేండ్ల కింద ఇదే దవాఖానకు నేను డెలివరీకి వచ్చాను. అప్పుడు వైద్యులు, సిబ్బంది వెంటనే స్పందించి మంచిగ చూసుకున్నరు. వెంటనే కేసీఆర్ కిట్ ఇచ్చిన్రు. ఇప్పుడు డిశ్చార్జ్ అవుతున్నా కిట్ ఇవ్వలేదు. ఒక్కటి నిజం చెబుతున్న అప్పటిలెక్క ఇప్పుడు లేదు.

**- సరిగొమ్ముల రజిత, మొగుళ్లపల్లి**

### అంతటా ఆపరేషన్లు చేస్తున్నరు



ప్రతి ప్రభుత్వ దవాఖానలో ఆపరేషన్లు చేస్తున్నరు. అందుకే డెలివరీల సంఖ్య తగ్గింది. తల్లి, పుట్టిన బిడ్డకు అవసరమయ్యే వస్తువులు ఉన్న ప్రభుత్వం అందించే కిట్ కొంచెం ఆలస్యమైనా అందరికీ అందజేస్తున్నాం. ఎన్‌హెచ్‌ఆర్‌ఎం కింద ఔట్‌సోర్సింగ్‌లో పని చేసే వైద్యులను ప్రభుత్వం తొలగించింది. దీంతో సిబ్బంది కొరత ఉంటున్నది.

**- రాజేందర్‌రెడ్డి, సూపరిండెంటెంట్**

# దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, మే 26 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 ఏళ్ల నుంచి 14 ఏళ్ళలోపు వయసు గల బధిర బాలబాలికలకు ప్రవేశాలు కల్పించనున్నట్లు, 1 నుంచి 6వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో, 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మాధ్యమంలో బోధనా తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత విద్య, భోజనం, వసతి సౌకర్యాలతోపాటు పాఠ్య, నోటు పుస్తకాలు, పాఠశాల ఏకరూపక దుస్తులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని బధిర విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, టీసీ, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు కలిపి శాతావాహన విశ్వవిద్యాలయానికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ బధిరుల పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాలకు 9000013639, 9000221301, 9666868755 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# జగిత్యాల మున్సిపాలిటీలో భారీ భూ బాగోతం!


## కోట్ల రూపాయల విలువైన భూమి కాజేసేందుకు ప్రయత్నం





**జగిత్యాల మున్సిపాలిటీ అవినీతికి కేరాఫ్ అడ్డాగా మారిపోయింది. విలువైన ఖాళీ స్థలాల వివరాలను సేకరించి కబ్జాదారులతో కుమ్మక్కై, వీఎల్‌టీ ఆధారంగా కబ్జా పెట్టడం ఇక్కడ షరామామూలై పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అవినీతి వెనుక అందులో పనిచేస్తున్న ఓ ఉద్యోగితోపాటు, లోపాయికారిగా మరికొందరు అధికారులకు సంబంధం ఉన్నట్టుగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ అధికారుల అవినీతి, కబ్జాదారుల కుమ్మక్కు ఎంత దూరం వెళ్లిందంటే ఓ భారీ భూ బాగోతం కండ్లకు కడుతున్నది. 13 ఏండ్ల క్రితం ఓ గ్రామ పంచాయతీ పరిధిలో పాసుపుస్తకం ద్వారా కొన్న 12 గుంటల స్థలానికి, మున్సిపల్‌లో ఆస్తిపన్నుకు సంబంధించిన నకిలీ పత్రాన్ని సృష్టించి, దాని ఆధారంగా ఒకేసారి 12 ఏండ్ల వీఎల్‌టీ టాక్స్ చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పన్నిన కుట్ర బయటపడింది. ఈ ప్రక్రియ మొత్తం, అందుకు సంబంధించిన పత్రాలు పరిశీలిస్తే అనేక లోపాలు, జారీలో అవకతవకలు జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. మరి ఉన్నతాధికారులు ఏం చేస్తారో చూడాల్సి ఉన్నదని ప్రజానీకం పేర్కొంటున్నది.**

- వీఎల్‌టీని అవకాశంగా తీసుకొని కొట్టేసే యత్నం
- పదముూడేండ్ల క్రితం కొన్న జాగకు ఒకేసారి 12 ఏండ్ల టాక్స్
- మున్సిపల్ పరిధిలో లేని భూమికి ఇంటినంబర్ కేటాయింపు
- అప్పటి మున్సిపల్ కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి ఆస్తిపన్ను కాపీ తయారీ
- ఈ అవినీతి లీల వెనుక ఓ ఉద్యోగి హస్తం?
- కబ్జారాయుళ్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు



*1999లో సర్వేనెంబర్ 1599లో ఆరుగుంటల భూమికి ఆస్తిపన్ను అసెస్‌మెంట్ చేసినట్లు మున్సిపల్ అధికారులు సృష్టించిన పత్రం*


జగిత్యాల, మే 26 (నమస్తే తెలంగాణ)/జగిత్యాల రూరల్: జగిత్యాల పట్టణానికి అత్యంత సమీపంలో ఉన్నది హస్నాబాద్. ఆ గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 1599లో 12 గుంటల భూమిని మండ పెద్ద రాజిరెడ్డి, మండ శ్రీనివాస్ తమకు చెందిన 12 గుంటల వ్యవసాయ భూమిని (పట్టాదారుపాసు పుస్తకం 286053, 54) పుల్ల భాగ్యలక్ష్మికి 2008లో మార్చి 17న (873/2008 డాక్యుమెంట్ నెంబర్) రిజిస్ట్రేషన్ చేశారు. అప్పటి నుంచి 2011 వరకు పుల్ల భాగ్యలక్ష్మి ఆధీనంలోనే ఆ భూమి ఉన్నది. కాగా, 2011లో పుల్ల భాగ్యలక్ష్మి వద్ద 12 గుంటల భూమిని కీర్తి విజయలక్ష్మి, వూటూరి గీతారాణి, గొల్లపెల్లి సత్యనారాయణ కొనుగోలు చేశారు. పుల్ల భాగ్యలక్ష్మి ముగ్గురికి 4660/2011 డాక్యుమెంట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేశారు. అప్పటి నుంచి కీర్తి విజయలక్ష్మి, వూటూరి గీతారాణి, సత్యనారాయణ ఆదీనంలో ఆ భూమి ఉన్నది.

### వీఎల్ టీ ద్వారా ఆక్రమించేందుకు స్కెచ్

భూమి ఖాళీగా ఉండడంతో కబ్జారాయుళ్లు కన్నేశారు. భూమిని కాజేసేందుకు ఉన్న మార్గాలను అన్వేషించారు. ఈ క్రమంలో హస్నాబాద్ పంచాయతీ పరిధిలో ఉన్న భూమికి జగిత్యాల మున్సిపాలిటీలో ఆస్తి పన్ను అసెస్‌మెంట్ పత్రాన్ని సృష్టించారు. సర్వే నంబర్ 1599లోని 722 చదరపు గజాల ఖాళీ స్థలానికి 1999 లోనే ఆస్తిపన్ను అసెస్‌మెంట్ జరిగినట్లు ఇంటి నంబర్ 4-4-325/13-సి/బి/ 1350/1999తో ఖాజా అమీరొద్దీన్ తండ్రిపేరు ఖాజా రుక్నొద్దీన్ పేరిట పత్రాన్ని తయారు చేశారు. దీనికి 2011 – 2015 మధ్య జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన జేఆర్ సురేశ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి పత్రాన్ని సృష్టించారు. దీని ఆధారంగా ఆన్‌లైన్‌లో 2012 నవంబర్ ఒకటో తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు 13 ఏండ్ల వీఎల్‌టీని ఈ నెల 3న చెల్లించారు. వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ) అసెస్‌మెంట్ కాపీ ఆధారంగా మరో వ్యక్తికి భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు వ్యూహం రచించారు.

### అనేక అవకతవకలు.. అన్నీ లోపాలే..

అయితే అసెస్‌మెంట్ పత్రంలో అనేక అవకతవకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం అయితే భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత ఆ పత్రాల ఆధారంగా ఇంటి నిర్మాణం చేసుకోకున్నా, మున్సిపాలిటీ పరిధిలో ఇంటినెంబర్‌ను కేటాయించుకొనేందుకు వీఎల్‌టీ ఉపయోగపడుతుంది. అయితే వీఎల్‌టీ ఇచ్చిన అవకాశాన్ని అధికారులు, కబ్జాదారులు అవకాశంగా తీసుకొని కబ్జాకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అమీరొద్దీన్ పేరిట రూపొందించిన ఆస్తిపన్ను అసెస్‌మెంట్ పత్రంలో అతడిని యజమానిగా పేర్కొన్న అధికారులు, 1999లోనే ఇంటి నంబర్‌ను కేటాయించినట్లుగా పేర్కొన్నారు. వీఎల్‌టీని మాత్రం 2012 నవంబర్ నుంచి తీసుకున్నట్టు చూపారు. వీఎల్‌టీ టాక్స్ ఒకేసారి పదముూడేండ్లకు చెల్లించడం, అది కూడా 2025 మార్చి 31వ తేదీ వరకు చెల్లించడం చూస్తే ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. అన్నింటి కంటే విచిత్రమైన విషయం ఏం టంటే.. ఆరేండ్ల క్రితం వరకు సర్వే నంబర్ 1599 హస్నాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నది. 2018లో జగిత్యాల మున్సిపల్ పరిధి విస్తరణ సమయంలో హస్నాబాద్ జీపీ భూములను ఆధీనంలోకి తీసుకువచ్చారు. కానీ, సిబ్బంది మాత్రం 1999లోనే ఇంటి నంబర్‌ను కేటాయించడం, 2012 నుంచి వీఎల్‌టీ ట్యాక్స్‌ను తీసుకోవడం విస్మయానికి గురి చేస్తున్నది.





*2011 నవంబర్ నుంచి 2025 మార్చి 31 వరకు ఒకేసారి వీఎల్‌టీ చార్జీలు ఆన్‌లైన్‌లో చేసిన రసీదు*

### మున్సిపల్ అధికారుల అండదండలతోనే!

సర్వే నంబర్ 1599లో 6 గుంటల భూమిని మున్సిపల్ అధికారులు, సిబ్బంది అండదండలతోనే కబ్జా చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆరేండ్ల క్రితం మున్సిపల్ పరిధిలోకి వచ్చిన భూమికి పాతికేండ్ల క్రితమే ఇంటి నంబర్ ఇచ్చినట్టు, ఆస్తి అసెస్‌మెంట్ చేసినట్టు పత్రాలు సృష్టించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కబ్జా ప్రయత్నం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్ల రూపాయల విలువ చేసే భూమిని అప్పనంగా రౌడీ షీటర్లు, కబ్జారాయిళ్లతో దొరకబుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని స్పష్టమవుతున్నది. జగిత్యాల మున్సిపల్ పరిధిలో ఇది తొలి వ్యవహారం కాదని, కొన్నాళ్లుగా ఇలాంటి కబ్జా ప్రయత్నాలు నిరాటకంగా కొనసాగుతున్నాయని తెలుస్తున్నది. మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే ఒక అధికారి, ఒక దిగువ స్థాయి అధికారి ఇలాంటి కబ్జాల వెనక ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో సహకరించినందుకు కబ్జారాయుళ్లతో ₹15లక్షల డీల్ చేసుకున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్‌లో అవినీతి పనులన్నింటికీ కీలక సూత్రధారిగా పనిచేస్తున్న ఓ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్లు (ప్రతిపక్షం, అధికారపక్షం) అందరూ కలిసి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీస్)కు ఫిర్యాదు చేసినా.. ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోనట్టు సమాచారం. కాగా ఈ వ్యవహారాల్లో మున్సిపల్ కీలక అధికారి ప్రమేయం ఉన్నదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### అవకతవకలు జరిగితే క్రిమినల్ కేసులే

సర్వే నంబర్ 1599లో 722 చదరపు గజాలకు సంబంధించిన అసెస్‌మెంట్ అంశం నా దృష్టికి వచ్చింది. వీఎల్‌టీ అసెస్‌మెంట్ పత్రాలను పరిశీలిస్తున్నాం. అసెస్‌మెంట్ పొందిన వ్యక్తి మొదటగా ఇంటి నంబర్ పొందిన సమయంలో మున్సిపల్ కార్యాలయంలో సబ్‌మిట్ చేసిన స్థల రిజిస్ట్రేషన్ పత్రాలను ఇవ్వాలని అడిగాం. అసెస్‌మెంట్ పత్రాల్లో తప్పులున్నాయని, అవకతవకలు జరిగాయని తేలితే అసెస్‌మెంట్‌ను క్యాన్సల్ చేయడంతో పాటు తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుదోవ పట్టించిన వారిపై క్రిమినల్ కేసులు పెడుతాం. అలాగే వ్యవహారంలో మున్సిపల్ సిబ్బంది ప్రమేయం ఉన్నట్టు, రికార్డులు ట్యాంపరింగ్ జరిగినట్టు తేలితే వారిపై సైతం శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఇక మున్సిపల్ పరిధిలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్న వ్యవహారం నా దృష్టికి రాలేదు. దానిపైనా విచారణ చేపడతాం.

**- అనిల్‌బాబు, జగిత్యాల మున్సిపల్ కమిషనర్**

# మానేరును తోడేస్తున్నరు

## జమ్మికుంట మండలంలో జోరుగా ఇసుక దందా



ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటున్న గ్రామస్తులు(ఫైల్)

- అనుమతుల్లేకుండా కొందరు, అనుమతుల పేరిట మరికొందరు
- నిత్యం వందకు పైగా ట్రాక్టర్లలో తరలింపు
- వాహనాలను 'రేస్' తరహాలో నడిపిస్తున్న డ్రైవర్లు
- ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్న మాఫియా
- అప్పుడప్పుడు కేసుల నమోదు చేస్తున్న పోలీసులు
- కన్నెత్తి కూడా చూడని రెవెన్యూ శాఖ
- అధికారుల వైఖరిపై సర్వత్రా విమర్శలు

**మానేరు వాగు తల్లడిల్లుతున్నది. ఇసుక తోడేళ్ల దోపిడీతో ఆనవాళ్లు లేకుండాపోతున్నది. అనుమతుల్లేకుండా కొందరు, అనుమతుల పేరిట మరికొందరు పగలనకా, రాత్రనకా తోడేస్తుండడంతో ప్రకృతి సంపద కనుమరుగైపోతున్నది. జమ్మికుంట మండలం కేంద్రంగా జోరుగా సాగుతున్న ఈ ఇసుక దందా, అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నది. రెవెన్యూ యంత్రాంగం రవాణాపై కన్నెత్తి చూడడం మానేయగా, మాఫియా మరింత బరితెగించింది. ఒకే సారి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు 'రేసింగ్' తరహాలో నడిపించుకుంటూ వెళ్లడమే కాదు, ఎవరైనా ప్రశ్నిస్తే బండ్లు మీదికి ఎక్కిస్తామని బెదిరిస్తున్నట్లు తెలుస్తున్నది. అయితే ట్రాక్టర్ల రేసింగ్‌లను భరించలేని మడిపల్లి గ్రామానికి చెందిన ప్రజలు ఆగ్రహంతో రెండ్రోజుల కింద పదుల సంఖ్యలో వాహనాలను అడ్డుకున్నానారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా ఒక్క ట్రాక్టర్‌ను కూడా పట్టుకోలేకపోవడం, ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంపై మండిపడుతున్నారు.**

జమ్మికుంట, మే 26 : జమ్మికుంట మండలంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించకపోవడంతో మానేరు నుంచి ఇసుకను అందినంత దోచుకుపోతున్నారు.

### మానేరు పరీవాహక ప్రాంతం నుంచి..

మానేరు పరీవాహక ప్రాంతానికి సమీపంలో విలాసాగర్, తనుగుల, గంగ్రపల్లి, తదితర గ్రామాలున్నాయి. మానేరులో ఇసుక ఉంది. దీన్ని ఆసరాగా చేసుకున్న సదరు గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు అడ్డగోలుగా ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. నిత్యం వందల ట్రాక్టర్లలో ఇసుక నింపుకుని జమ్మికుంట, హుజూరాబాద్, కమలాపూర్, హన్మకొండ, వరంగల్, తదితర సుదూర ప్రాంతాలకు తరలించుకుపోతున్నారు. అయితే, కొత్తగా వచ్చిన సీపీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు కొద్ది రోజుల పాటు ఇసుకపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇసుకాసురులకు కౌన్సెలింగ్‌లు ఇచ్చారు. దొరికిన ట్రాక్టర్లపై కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత ఏమైందో ఏమో తెలియదు కానీ, ఇటీవల మళ్లీ ఇసుక మాఫియా రెచ్చిపోయింది. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఒకేసారి రోడ్డు మీదకు వస్తున్నాయి. రయ్.. రయ్‌మంటూ తోలుకుంటూ పోతున్నారు. అయితే, ట్రాక్టర్ డ్రైవర్లలో చాలామంది మైనర్లు ఉంటున్నారు. రోడ్ల మీద ప్రజలు నడవాలన్నా, వాహనాలపై వెళ్లాలన్నా, భయాందోళనకు గురవుతున్నారు. రోడ్లపై ట్రాక్టర్ల రేసింగ్‌లను భరించలేని మడిపల్లి గ్రామానికి చెందిన ప్రజలు మర్లబడ్డారు. శనివారం పదుల సంఖ్యలో వాహనాలను అడ్డుకున్నారు. ప్రశ్నించారు. పోలీసులకు సమాచారం అందించారు. అయినా పోలీసులు ఒక్క వాహనాన్ని కూడా పట్టుకోలేకపోయారు.



### ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

కొన్ని నెలల క్రితం అక్రమ ఇసుక రవాణాపై అధికారులు కొరడా ఝులిపించారు. కేవలం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక అవసరమున్న వినియోగదారుడు మీ సేవ కేంద్రంలో చలాన్లు తీసిన తర్వాతే ఇసుక రవాణా జరిగేది. అలా కొద్ది రోజులు సజావుగా సాగింది. అయితే, ఇందులో చలాన్లు తీసిన వినియోగదారునికి దొడ్డు ఇసుక సరఫరా చేసిన ఇసుకాసురులు, సన్నం ఇసుకను బ్లాక్ చేశారు. సదరు ఇసుకను ఎక్కువ ధరలకు అమ్ముకుని దందా సాగించారు. కొంతలో కొంత ప్రభుత్వానికైతే ఆదాయం వచ్చింది. అక్కడ వరకు బాగానే ఉంది. ఇటీవల ఇసుకపై అధికారులెవరూ పట్టించుకోపోవడంతో ఇన్నాళ్లూ నిల్వ ఇసుక డంపులను తోడుకుని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. జమ్మికుంటకు ఒక్కో ఇసుక ట్రాక్టర్‌కు రూ.3 వేలు, దూర ప్రాంతాలకై రూ.10 వేలకు పైగా విక్రయిస్తున్నారు. వెరసి ప్రభుత్వాదాయానికి కోట్లలో గండి పడుతోంది. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు, సిబ్బంది పాత్రపై ఉన్నతాధికారులు విచారణ చేయాల్సిన అవసరం ఉందనే డిమాండ్లున్నాయి. లేకపోతే ఇంతలా రెచ్చిపోతున్న ఇసుక మాఫియాపై చర్యలెందుకు తీసుకోవడం లేదంటున్నారు. ఏది ఏమైనా ఇసుక అక్రమ రవాణా, ర్యాష్ డ్రైవింగ్‌లను అరికట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### పర్మిషన్లకు ఎవరూ రావడం లేదు..

ఇసుక కావాలంటే పర్మిషన్లు తీసుకోవాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు చలాన్ కట్టాలి. అంతే కానీ, అక్రమంగా తీసుకెళ్ల కూడదు. ఇప్పటి వరకైతే ఇసుక అక్రమ రవాణా మా దృష్టికి రాలేదు. ఏం జరుగుతుందో తెలుసుకుంటా.

**- విజయ, జమ్మికుంట తహసీల్దార్**

### ఇసుక అక్రమార్కులపై 'షీట్' ఓపెన్ చేస్తం

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టినం. కేసులు నమోదు చేస్తున్నం. మమ్మల్ని కనిపెట్టుకుంటూ రవాణా చేస్తున్నరు. అయినా, ఎవరినీ వదిలిపెట్టేది లేదు. నిఘా పెడుతున్నం. గస్తీ తిప్పుతం. అవసరమైతే ఇసుక అక్రమార్కులపై రౌడీ షీట్స్ కూడా ఓపెన్ చేసేందుకు వెనుకాడం.

**- వీ రవి, జమ్మికుంట టౌన్ సీఐ**


# జీలుగ విత్తనాల కోసం పడిగాపులు

## మల్లాపూర్ మండలం ముత్యంపేటలో వేకువజామున నుంచే నిరీక్షణ



*జీలుగ విత్తనాలకు కోసం అధికారులకు జిరాక్స్‌లు ఇవ్వడానికి కిక్కిరిసిన రైతులు*

మల్లాపూర్, మే 26 : వానకాలం సమీపిస్తున్న తరుణంలో విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాయాల్సి వస్తున్నది. వరి పంటలు వేసే ముందు భూసారం పెంపు కోసం పచ్చిరొట్ట (జీలుగ) విత్తనాలు ఎంతో అవసరం ఉంటుంది. కానీ, ఇవి కావాలంటే రైతులు వేకువజామున నుండే కార్యాలయం ఎదుట గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలోని పీఏసీఎస్ కార్యాలయానికి ఇటీవలే జీలుగ విత్తనాలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న ముత్యంపేట, రాఘవపేట, హుస్సేన్‌నగర్, సిరిపూర్ గ్రామాలకు చెందిన రైతులు వాటి కోసం కోసం కార్యాలయం ఎదుట బారులు తీరారు. వచ్చిన 400 సంచులు కేవలం రెండు గంటల సమయంలోనే అయిపోవడంతో చుట్టు పక్కన గ్రామాల నుంచి వచ్చిన రైతులు విత్తనాలు దొరకక నిరాశతో వెనుదిరిగారు.



*కంకర, ఇసుకను అపహరించిన ఖాళీ ప్రాంతాన్ని చూపుతున్న కాంట్రాక్టర్, ఇంజినీర్*

## కాలువ నిర్మాణానికి తెచ్చిన
# ఇసుక, కంకర మాయం

- **కాళేశ్వరం 9వ ప్యాకేజీ కెనాల్ పనుల కోసం అక్కపల్లిలో డంపింగ్**
- **అపహరణపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని కాంట్రాక్టర్ ఆవేదన**

ఎల్లారెడ్డిపేట, మే 26: రెండేండ్ల క్రితం కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీ కెనాల్ నిర్మాణ పనుల కోసం తెప్పించిన ఇసుక, కంకర మాయమైందని కాంట్రాక్టర్ జేబీ, నిర్మాణ సంస్థకు సంబంధించిన ఇంజినీర్ వేణు ఆరోపించారు. ఆదివారం ఖాళీ అయిన డంపును చూసి ఇంజినీర్ వేణు వివరాలు వెల్లడించారు. రూ.6.50 లక్షల విలువైన కంకర, రూ.లక్ష విలువైన ఇసుక స్థానికులే అమ్ముకున్నారని అందుకు సంబంధించిన ఆధారాలు సైతం తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఇది వరకే అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో లక్షల్లో మోసపోయామని ఆవేదనగా తెలిపారు. ఇప్పటికైనా ఇసుక, కంకర మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.